మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
epaper.manachourasta.com
సంపుటి : 01 | సంచిక : 117 | గురువారం, 26 మార్చి 2026 | పేజీలు : 4





# ఏపీలో ఘోర ప్రమాదం

## కాలిబూడిదైన ట్రావెల్స్ బస్సు

- 13 మంది సజీవ దహనం
- హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తున్న బస్సు

**మన చౌరాస్తా, డెస్క్ :** ఆంధ్రప్రదేశ్ లోని మార్కాపురం జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా చెలరేగిన మంటలతో బస్సు పూర్తిగా దగ్ధం అయింది. ఈ ఘటనలో 13 మంది సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బస్సులో ఎంత మంది ఉన్నారన్న దాని స్పష్టత రావల్సి ఉంది. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. కాగా, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందంటున్నారు పోలీసులు. హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు చీమకుర్తి నుంచి కంకర తీసుకొస్తున్న టిప్పర్ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి రెండు వాహనాలు పూర్తి దగ్ధమయ్యాయి. హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో 13 మంది కాలిబూడిదయ్యారు. మరో 12 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా, దాదాపు 20 మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చే లోపే వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎక్కువ గా కనిగిరి, పామూరు ప్రాంత వాసులుగా ఉన్నట్లు తెలుస్తోంది. సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు, పోలీసులు గాయపడ్డవారిని, అంబులెన్స్ లో ఎక్కించి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబందించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.





# కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

## 27న శ్రీరామ నవమి రోజు పార్టీ పేరు ప్రకటన

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.




మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
గురువారం, 26 మార్చి 2026
Mana Chourasta




# పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం జనగామలోని మైనార్టీ సంక్షేమ గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా స్టాఫ్ రూమ్ ని చెక్ చేసి ఆ తరవాత పదవ తరగతి విద్యార్థుల దగ్గర కి వెళ్లి మాథ్స్ పరీక్షకి ఏ విధంగా ప్రిపేర్ అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. మాథ్స్ లోని కొన్ని అంశాలని కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు భోదించారు. మాథ్స్ లోని కొన్ని అంశాలని కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు భోదించారు. కిచెన్ రూమ్ లోకి వెళ్లి వంట సామాగ్రి ని చూసి అన్నీ తాజాగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. చుట్టూ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రం గా పెట్టుకోవాలని, టాయిలెట్స్, విద్యార్థుల రూమ్ లు కూడా నీట్ గా పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు.



అనంతరం శామీర్ పేట్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల ను కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటికి ఎంత ఖర్చు అయ్యింది.. నిర్మాణం జరిగిన తీరును.. అలాగే సొంత ఇంటి కల నెరవేరడం తో వారి అభిప్రాయాలను కలెక్టర్ స్వయం గా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్‌డీవో విక్రమ్, హౌసింగ్ పీడీ మాత్రు నాయక్ ఉన్నారు.



# వావిలాల దుర్గమ్మకు ఎర్రబెల్లి పూజలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మండలంలోని వావిలాల గ్రామంలో దుర్గమ్మ వేడుకల్లో మాజీ మంత్రి దయాకర్ రావు పాల్గొని సందడి చేశారు. పాడి పంటలు సంమృద్ధిగా, సల్లగా చూడు తల్లి అని అమ్మ వారిని కోరినట్లు మాజీ మంత్రి తెలిపారు. ఎర్రబెల్లితో చిన్నారులు, మహిళలు సెల్ఫీలు దిగడానికి పోటీపడ్డారు. అటు ఆయన కూడా స్థానికులను పేరుపేరునా నవ్వుతూ పలకరించి ఆకట్టుకున్నారు.



# కలెక్టర్‌పై ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు

**జనగామ, మన చౌరాస్తా :-** జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ చర్యలపై వనిత టీ స్టాల్ నిర్వాహకురాలు పాలమాకుల చిన్న మంజుల హైదరాబాద్‌లోని ఎస్సీ ఎస్టీ కమిషన్ కార్యాలయంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యని కలిసి ఫిర్యాదు చేశారు. తనను ఈనెల 10వ తేదీ నుండి ప్రభుత్వం శాంక్షన్ చేసిన ఇందిరా శక్తి మహిళా పథకం వనిత టీ స్టాల్ ను కలెక్టర్ ఆఫీస్ గోడ మూల నుండి తొలగించాలని మున్సిపల్, రెవెన్యూ, కరెంటు, ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ అధికారులతో ఇబ్బందుల గురిచేస్తున్నారని వివరించారు. కలెక్టర్‌ను కలిసి తన బాధ చెప్పుకుందామని వెళ్లి కాళ్ళ ఏళ్ల పడిన కూడా కనీసం పట్టించుకోకుండా అవమానకరంగా చూస్తూ అవమానపరిచాడని తన గన్మెన్ నరసయ్యతో బలవంతంగా తన మీద చేయి వేసి నెట్టివేయించాడని తన పట్ల అవమానకరమైన పద్ధతిగా వ్యవహరించిన జనగామ జిల్లా కలెక్టర్‌పై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులు పేర్కొన్నారు. వెంటనే స్పందించిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఈ అంశంపై కలెక్టర్ కు నోటీసు జారీ చేస్తానని సీఎంకు కూడా లేక రాస్తానని తెలిపారు. అదేవిధంగా తను జనగామ పోలీస్ స్టేషన్లో కలెక్టర్ పైన ఇతర అధికారుల పైన ఫిర్యాదు చేసిన విషయాన్ని తెలుసుకొని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో ఫోను ద్వారా మాట్లాడి సంబంధిత బాధిత మహిళా ఇచ్చిన sc,st ఫిర్యాదు పై దర్యాప్తు వేగవంతం చేసి చర్య తీసుకొని బాధిత మహిళకు న్యాయం చేసి తనకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాధిత మహిళ వెంట డీఎస్ఎంఎం జాతీయ కమిటీ సభ్యురాలు పల్లెర్ల లలిత, అంబేద్కర్ సంఘం జనగామ జిల్లా అధ్యక్షులు తిప్పారపు విజయ్ కుమార్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బూడిది గోపి, దళిత యువజన సంఘం జిల్లా నాయకులు గూడూరు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# వల్మిడిలో ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

**పాలకుర్తి, మన చౌరాస్తా :** డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ నరసయ్య, పాలకుర్తి సిఐ జానకిరామ్ రెడ్డి, ఎస్సై పవన్ కుమార్ మండలంలో ప్రమాదకర మూలమలుపుల వద్ద చెట్లను తొలగించి సరి చేయించారు. సిద్ధార్థ విద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాల్మిడిలో నేడు జరిగే శ్రీరామ నవమి వేడుకల ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు సందర్శించి పర్యవేక్షించారు. కళ్యాణం ఏర్పాట్లను పరిశీలించారు.




## పెన్షనర్ల ఆందోళన

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని జనగామలో స్టేషన్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదురుగా నిరసన తెలిపారు. మంగళవారం ఉదయం పన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్రం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- మన చౌరాస్తా, జనగామ



# పాత బీట్ బజార్‌లో అన్న ప్రసాద వితరణ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలోని పాత బీట్ బజార్‌లో శ్రీ సీతారామ నవరాత్రోత్సవ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దాత సోమ విజయలక్ష్మి, హనుమంతరావు ఇందుకు సహకరించారు. 27 మార్చి శుక్రవారం రోజున శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

■ **ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆరఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు. వీటి వల్ల పేదలకు లబ్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇప్పటికే పూర్తయి.. ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఖైరతాబాద్‌లో 5 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టేందుకు శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు. చిన్న చిన్న రిపేర్ల కారణంగా వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. బీఆరఎస్ ప్రభుత్వంలో పార్టీని దృష్టిలో పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు చెప్పే వారికే ఇళ్లు ఇస్తామంటున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు అని గతంలో మాట్లాడిన కేసీఆర్.. గత పదేళ్ళలో అసలైన పేదలకు ఇళ్లు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేతపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు సైతం కాలం చెల్లడంతో అవి శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు బ్జడెట్ లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆరఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గానికి నాలుగున్నర లక్షల ఇళ్లు అన్ని పల్లా మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నియోజకవర్గానికి అన్ని ఇళ్లు ఉంటాయా అంటూ సందేహం వ్యక్తం చేశారు. సభను పక్కదారి పట్టించడమే ఏజెండాగా పెట్టుకున్నారని పల్లాపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పెన్షనర్లకు నష్టం చేసే చట్టాన్ని ఉపసంహరించాలి




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వ్యాలిడేషన్ చట్టం-2025ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన రిటైర్డ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా తమ ఆందోళనను వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం తహసీల్దార్ రాజేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనిట్ అధ్యక్షుడు ఆదిరెడ్డి మాట్లాడుతూ, పెన్షనర్లను వర్గీకరించే అధికారం కేంద్రానికి కల్పిస్తూ రూపొందించిన ఈ చట్టం 2025 మార్చి 25 నుంచి అమల్లోకి రావడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ముందస్తు చర్చలు లేకుండా, సంబంధిత వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఫైనాన్స్ బిల్లులో భాగంగా ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి అదే రోజున Lok Sabha ఆమోదించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని విమర్శించారు. ఈ చట్టం అమలులోకి వస్తే ఉద్యోగ విరమణ తేదీ ఆధారంగా పెన్షనర్లను వర్గీకరించే పరిస్థితి ఏర్పడుతుందని, దాంతో వివిధ కేంద్ర పే కమిషన్ల అమలు కాలానికి ముందు రిటైర్ అయిన లక్షలాది మంది పెన్షనర్లు ఆ ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది పెన్షనర్ల మధ్య అసమానతలను పెంచడమే కాకుండా, ఒకే విధంగా పనిచేసిన ఉద్యోగుల మధ్య అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో పెన్షన్ పెంపు లేకపోవడం వృద్ధుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ఔషధాలు, వైద్య ఖర్చులు, నిత్యావసరాల ధరలు పెరిగిన ఈ సమయంలో పెన్షన్‌లో పెరుగుదల లేకపోవడం వల్ల రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థికంగా మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. అలాగే ఈ చట్టం అమలుతో పాత పెన్షనర్లకు న్యాయపరమైన రక్షణ కూడా తగ్గిపోతుందని, వారి హక్కులు హరించబడే అవకాశం ఉందని సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి, వ్యాలిడేషన్ చట్టం-2025ను ఉపసంహరించుకోవాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భీమదేవరపల్లి యూనిట్ అధ్యక్షుడు ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగయ్య, కోశాధికారి రాజమౌళి, ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, జాయింట్ కార్యదర్శి సారయ్య, సభ్యులు చంద్రరెడ్డి, గోరెమియ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ రచ్చ విజయకుమార్ మృతి



**జనగామ, మన చౌరాస్తా :** గత కొంత కాలంగా అస్వస్థతో ఉన్న సీనియర్ జర్నలిస్ట్ రచ్చ విజయకుమార్ (74) బుధవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న హైదరాబాద్ నాగోల్ లో అంత్యక్రియలు గురువారం జరుగుతాయని ఆయన సోదరుడు రచ్చ రమేశ్ తెలిపారు. దివంగత విజయకుమార్, భారతి దంపతులకు ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్న కుమారుడు విష్ణువర్ధన్ ఇరువురు కుమార్తెలు ఉన్నారు. జనగామ పట్టణానికి చెందిన విజయకుమార్ ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్ర జ్యోతి దిన పత్రికల్లో జనగామ విలేకరిగా పనిచేశారు. తీర్పు వార పత్రికను ప్రారంభించి కొంత కాలం మాత్రం నడిపించారు. జనగామ పట్టణానికి చెందిన తొలి తరం పాత్రికేయులలో ఒకరైన విజయకుమార్ మరణ వార్త విని సీనియర్ జర్నలిస్ట్, లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు, భోపాల్‌లో ఉన్న బులుసు ఈశ్వర్ కుమార్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. విజయకుమార్‌తో కలిసి పని చేసిన మలితరం పాత్రికేయులు పార్నంది వెంకటస్వామి, ఎం.శివకుమారు, జి.కృష్ణ, ఐజేయూ నాయకుడు దాసరి కృష్ణారెడ్డి, జనగామ ప్రాంతానికి చెందిన పలువురు పాత్రికేయులు విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. విజయకుమార్ మృతి పట్ల పుర ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, బక్క నాగరాజు, ధర్మపురి శ్రీనివాస్, డా. డి. లవ కుమార్ రెడ్డి. డా. రాజమౌళి, డా.లక్ష్మీనారాయణ నాయక్ తదితరులు సంతాపం ప్రకటించారు.

# 26న మహా ధర్నాను విజయవంతం చేయాలి

జనగామ, మన చౌరాస్తా : కేజీబీవి, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 26 న నిర్వహించబోతున్న మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ టీఎస్ యుటిఎఫ్ జనగామ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రావు ,మదూరి వెంకటేష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అనాథ, పాక్షిక అనాథ బాలికల కోసం నిర్వహిస్తున్న కెజిబివిలు, మండల వనరుల కేంద్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల లలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని సంవత్సరాలుగా పనిచేస్తున్నా వేతనాలు అరకొరగానే ఉన్నాయని, గతంలో చేసిన అనేక పోరాటాల ఫలితంగా రెండు,మూడు సమస్యలు మాత్రమే పరిష్కారం అయ్యాయని ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు జరపకపోగా గత సంవత్సరం 29 రోజులు సమ్మె చేసిన సమయంలో ఉపముఖ్యమంత్రి గారితో జరిగిన చర్చల సందర్భంగా అంగీకరించిన డిమాండ్లు కూడా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కెజిబివిలలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల వేతనాలు మాత్రం అతి తక్కువగా ఉన్నాయని వారు తీవ్ర శ్రమదోపిడికీ గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు సహేతుకమైన నిర్ణయం తీసుకుని పార్లమెంట్ కు సమర్పించే సమగ్ర విద్య నివేదిక లోనే బేసిక్ పే నిర్ణయం తీసుకుని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 26 న హైద్రాబాద్ ధర్నా చౌక్ లో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో FWF రాష్ట్ర డైరెక్టర్ ఆకుల శ్రీనివాస రావు, జిల్లా ఉపాధ్యక్షులు మంగు జయ ప్రకాష్,హేమలత , కోశాధికారి శ్రీనివాస్ కార్యదర్శులు కందుల శ్రీనివాస్, కృష్ణ, నీలకంఠం, కృష్ణమూర్తి, యాదవ రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, వసంత్ నాయక్ ముషీర్ ఖాన్, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టూరిజం కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాల పెంపు

**– జయేష్ రంజాన్‌కు కృతజ్ఞతలు**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ టూరిజం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు పెంచినందుకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజాన్‌ను టూరిజం కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. టూరిజం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచాలని వారు జయేష్ రంజాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై జయేష్ రంజాన్ సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాల పెంపు నిర్ణయం ఉద్యోగుల్లో ఆనందాన్ని కలిగించిందని, ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, జ్యోతి, రాజశేఖర్, ప్రదీప్ పాల్గొన్నారు.

# ధురంధర్-2 కలెక్షన్ల సునామీ

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది. ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**